మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
15.5.2026 శుక్రవారం Friday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 18 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## పంజాబ్‌కు వరుసగా ఐదో ఓటమి



ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# కేరళ సీఎంగా వీడీ సతీశన్

ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ పదరోజుల కసరత్తు అనంతరం ప్రకటన

.. వివరాలు 4లో



# ఢిల్లీలో మరో నిర్భయ ఘటన

వివాహితపై డ్రైవర్, కండక్టర్ అత్యాచారం

.. వివరాలు 4లో

## నీట్-యూజీ 2026 రద్దు...

# మోడీ సర్కార్ ఫెయిల్

## మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్

### ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు

### కేంద్రం తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం



**జనతా న్యూస్, హైదరాబాద్,మే14 :** నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్‌కు

మిగతా 2 లో





## ఇంటర్ విద్యా విధానంలో

# మార్పులు

### ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు

### మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు

ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు.

02



02

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ

### వారం రోజులకు వాయిదా వేసిన కోర్టు

### బెయిల్‌పై నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు

## మరోమారు తెరపైకి

# ఫార్ములా కేసు

### కేటీఆర్ తదితరులకు ఏసీబీ నోటీసులు

### జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు

తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి.

02





## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో

# సర్ ప్రక్రియ

### జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు

### కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన

04

దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది.

# చివరిగింజ వరకు కొంటాం

### రైతుల కు మంత్రి ఉత్తమ్ హామీ

### పొంగులేటితో కలిసి పాలేరు ధాన్యం కనుగోళ్లు పరిశీలన





# జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

### తనకుమంచి స్నేహితుడని అంటూ పొగడ్తలు

### ఇరు దేశాల మధ్య శిఖరాగ్ర సదస్సులో ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు.



# స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

### రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

### జొన్న, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొంటోంది

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# నీట్-యూజీ2026 రద్దు... మోడీ సర్కార్ ఫెయిల్

మొదటి పేజీ తరువాయి



ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

# భద్రాద్రిని దర్శించుకున్న తుమ్మల

## ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ

**భద్రాద్రి కొత్తగూడెం,మే14 :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ప్రత్యేక స్వాగతం పలికారు. శ్రీ సీతారామచంద్ర స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి అయ్యాయి. 1986 మే 14 తేదీన తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దర్శనానంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాముడు అంటే భద్రాచలం అనేలా భక్త రామదాసు రామాలయం పునఃనిర్మాణం చేశారన్నారు. పూజ్యులు ఎన్టీఆర్ పాలనలో భద్రాచలం రామాలయం అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. రూ.351 కోట్లతో రామాలయం పునరాభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని ఆశీస్సులు ఎప్పుడూ ఉన్నాయన్నారు. భద్రాచలం ప్రాంతం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష షెడ్యూల్

## నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్,మే14 :** ఉమ్మడి పీజీ ప్రవేశపరీక్ష (సీపీగెట్)కు ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 7 విశ్వవిద్యాలయాలతోపాటు జేఎన్‌టీయూహెచ్, కొత్తగూడెం ఎర్త్‌సైన్సెస్ వర్సిటీల్లో పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించనున్న సీపీగెట్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, వర్సిటీల వైస్ ఛాన్సలర్లు(వీసీలు), కన్వీనర్ తదితరులు విడుదల చేశారు. తొలిసారి సీపీగెట్‌ను తమ వర్సిటీ నిర్వహిస్తోందని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈసారి ఇంటర్ విద్యార్హతతో ప్రవేశాలు పొందే ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీ సీపీగెట్ ద్వారా ఉండదని, వాటిని దోస్త్‌లో చేర్చినట్లు తెలిపారు. కన్వీనర్ ఆచార్య రాజేందర్ మాట్లాడుతూ మొత్తం 45 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆలస్య రుసుం లేకుండా జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.2 వేల ఆలస్య రుసుంతో 18 వరకు అవకాశం ఉంటుంది. జులై తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆగస్టు మొదటివారంలో తరగతుల ప్రారంభం. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టుల భర్తీకి మార్గదర్శకాలతో 2025 ఏప్రిల్‌లో ప్రభుత్వం జీవో జారీచేసినా.. ఇంకా ఏ వర్సిటీ ఎన్ని ఖాళీలను భర్తీ చేసుకోవాలన్నది స్పష్టత ఇవ్వలేదని ప్రతాప్‌రెడ్డి ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తగినంత మంది ఆచార్యులు లేకపోవడం వల్ల పరిశోధన కొంత తగ్గిందన్నారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ నియామకాల్లో కొంత ఆలస్యమైన విషయం వాస్తవమేనని, ప్రభుత్వంతో సంప్రదిస్తున్నామని తెలిపారు.

# హైదరాబాద్‌లో మరోమారు భారీగా డ్రగ్స్ పట్టివేత

## డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి పట్టివేత

**హైదరాబాద్,మే14 :** నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సూరారం- కొంపల్లి హైటెన్షన్ రోడ్‌లో డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇన్నోవా కారులో డ్రగ్స్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కారు ఆపిన అధికారులు.. తనిఖీలు చేపట్టగా డ్రగ్స్ బయటపడింది. నిందితులు నుంచి మూడు గ్రాములు ఎండీఎంఏ, 36 గ్రాముల ఓజీ కుష్, 7 గ్రాముల చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.2.58 లక్షలు ఉంటుందని అంచనా. బడా బాబుల పిల్లలే టా÷-గ్గ౦÷ట్‌గా డ్రగ్స్ అమ్మకాలు జరిపి.. నిందితులు భారీగా సొమ్ము చేసుకుంటు న్నట్లు ఎస్టీఎఫ్‌బీ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌తో పాటు కారును సీజ్ చేశారు. డ్రగ్స్‌ను ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎప్పటి నుంచి ఈ దందా నడిపిస్తున్నారనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల వెనక పెద్ద ముఠా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం


## రెండున్న గంటలపాటు నిలిపివేత

**నల్లగొండ,మే14 :** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు పాటు నిలిచిపోయింది. ఇంజిన్‌లో విద్యుత్ సమస్య తలెత్తడంతో రైలు ఆగిపోయింది. మరమ్మతుల అనంతరం రైలు 9:50 గంటలకు బయలుదేరి వెళ్లింది. ట్రైయిన్ ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండాకాలం కావడంతో ట్రైన్‌లో ఫ్యాన్లు, ఏసిలు పనిచేయకపోవడంతో నానాయాతన పడ్డారు.

# ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

## ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు

## మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు




**హైదరాబాద్,మే14 :** ఇంటర్ విద్యా విధానంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పులు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులక్కు ÷నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది.

ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ÷నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# మరోమారు తెరపైకి ఫార్మూలా కేసు

## కేటీఆర్ తదితరులకు ఏసీబీ నోటీసులు

## జూలై 31న విచారనకు రావాలని ఆదేశాలు

**హైదరాబాద్,మే14 :** తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి నోటీసులు జారీ చేసింది.

ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

# కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

## కీలక అంశాలపై ఇరు నేతల చర్చలు



**హైదరాబాద్,మే14 :** మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ

## వారం రోజులకు వాయిదా వేసిన కోర్టు

## బెయిల్‌పై నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు

**హైదరాబాద్,మే14 :** బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిషటన్‌పై విచారణనను హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజులకు వాయిదా వేసింది. నిందితుడు బండి సాయి భగీరథ్ తరపు న్యాయవాది హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు విచారణ వారం రోజులు వాయిదా వేసింది. భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, మధ్యంతర బెయిల్‌పై నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేయగా, ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక అంశాలను లేవనెత్తారు. కరీంనగర్‌లో బాధితురాలిపై తప్పుడు కేసు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు. బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో, కరీంనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారని వివరించారు. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉ ందని పీపీ వాదించారు. అయితే, దీనిపై స్పందించిన హైకోర్టు.. 'ప్రతిసారీ నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడని పదే పదే చెప్పాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించింది. భగీరథ్ తరఫున అడ్వకేట్ కృష్ణకాంత్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో భగీరథ్‌పై 'పోక్సో' చట్టం వర్తించదని, ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించామని తెలిపారు. యువతి మైనర్ అనే నెపంతో విచారణకు వెళ్లే సమయంలో భగీరథ్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. 'బండి సంజయ్ కుమారుడు కావడంతోనే నిరాధారంగా పోక్సో చట్టాన్ని ప్రయోగించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పొలిటికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. నిందితుడిని సామాన్యుడిలాగే పరిగణించి న్యాయం చేయాలి' అని ఆయన కోరారు. ఇక, తమ వాదనలు వినిపించడానికి సమయం కావాలని బాధితురాలి తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు శుక్రవారం మధ్యంతర బెయిల్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. కాగా, ముందస్తు బెయిల్ రావడానికి వారం సమయం పట్టేలా ఉండటంతో, ఆ వారం లోపు అరెస్టు కాకుండా ఉండేందుకు బండి భగీరథ్ న్యాయవాది మధ్యంతర బెయిల్ కోరారు. దీనిపై నేడు కోర్టు ఇచ్చే ఆదేశాలు బండి భగీరథ్‌కు కీలకం కానున్నాయి. బండి సాయి భగీరథ్ ఇంటరిమ్ ప్రొటెక్షన్ (మధ్యంతర రక్షణ)పై విచారణను వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది. బాలికపై లైంగిక దాడి, ఇతర నేరారోపణల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. బండి సాయి భగీరథ్ కోసం గాలింపు చర్యలు మొదలు పెట్టిన పేట్ బషీరాబాద్ పోలీసులు మంగళవారం కరీంనగర్‌కు వెళ్లి, విచారణ నిమిత్తం భగీరథ్‌ను వెంట తీసుకొని బుధవారం మధ్యాహ్నం 2గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని అతడి మేనమామ వంశీకృష్ణకు నోటీసులు కూడా అందజేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం విచారణకు పోలీసులు సిద్ధంగా ఉన్నా నిందితుడు మాత్రం హాజరుకాకుండా డుమ్మాకొట్టాడు. పైగా వ్యక్తిగత కారణాలతో తాను ఈ రోజు విచారణకు హాజరుకాలేక పోతున్నానని, పూర్తి ఆధారాలతో ఈ నెల 15న హాజరై పోలీసులకు సహకరిస్తానని, రెండు రోజుల గడువు ఇవ్వాలంటూ పోలీసులకు పంపిన ఈ-మెయిల్‌లో పేర్కొన్నాడు. ఇప్పుడు హైకోర్టు బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా వేయడంతో 15న విచారణకు హాజరవుతాడా లేదా అన్న అనుమానం ఉంది.



# స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

**రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం**

**జొన్న, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొంటోంది**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**భద్రాద్రి కొత్తగూడెం,మే14 :** స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్రప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం రైతులను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దళారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం మొక్కజొన్న, జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. కొనుగోళ్లతో రాష్ట్రంపై రూ.4 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం మంత్రి తుమ్మలకు పామాయిల్ రైతులు ఆత్మీయ సత్కరం చేశారు. మంత్రిగా నలభై సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తుమ్మలను సత్కరించారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో మంత్రి తుమ్మల ఆత్మీయ సత్కార కార్యక్రమంలో పది ఉమ్మడి జిల్లాల పామాయిల్ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. పెరిగిన సాగు వ్యయాలకు ఎంఎస్పి సరిపోవని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. వరి ఎంఎస్పిని కేవలం 72శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పెంచిందని దుయ్యబట్టారు. మొక్కజొన్న పైనా మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 10శాతం పెంపుతో రైతులకు న్యాయం జరగదని తెలిపారు. మద్దతు ధరలు కనీసం 30 నుంచి 40 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పి ప్రకటించడం కాదని.. కొనుగోలు చేయడమే ముఖ్యమని తెలిపారు. ప్రతి పంటలో 75శాతం దిగుబడిని కేంద్రం కొనాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, జొన్నలను ఖాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.పత్తి, వేరుశనగ, సోయాబీన్ ఓ-ూఖలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం పెంచే సంకల్పం కేంద్రానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పామాయిల్ సాగుకు దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు చేతుల మీదుగా శ్రీకారం చుట్టామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో పామాయిల్ సాగు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చానని ప్రస్తావించారు. అకాల వర్షాలతో ధాన్యం, మొక్కజొన్న రైతులు కష్టాలు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఆ సమస్యలు చూసిన వారు పామాయిల్ సాగు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాల వల్లే తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్రం సహకరించకున్నా మద్దతు ధరకు పంటలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతాంగం కోసం ఏడాదిలోనే లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు పెట్టామని తెలిపారు. ఆదివాసీ బిడ్డలకు ఉద్యోగాలు దక్కేలా చంద్రబాబు జీఓ నంబర్ -3 తీసుకువచ్చారని ప్రస్తావించారు. నలభై ఏళ్ల క్రితం రైతాంగం కష్టాలు ఈ తరం వారికి లేవని చెప్పుకొచ్చారు. మారిన కాలానుగుణంగా అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద, చీడ పీడలు లేకుండా పామాయిల్ సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో పోటీ పడ్డా ఎన్టీఆర్ వ్యవసాయ కళాశాల అశ్వారావుపేటకే ఇచ్చారని ప్రస్తావించారు. హార్టికల్చర్ హబ్‌గా అశ్వారావుపేట ఉందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ కళాశాలకు తోడు ఉద్యాన కళాశాల అశ్వారావుపేట కు మణిహారమని ఉద్ఘాటించారు. చంద్రబాబు హెలికాప్టర్ నుంచి చూసి అశ్వారావుపేట పచ్చదనంపై ఆశ్చర్య పోయారని తెలిపారు. యుద్ధాలు జియో పాలిటిక్స్ వల్ల యూరియా సరఫరాలో కేంద్రం అనుకున్న స్థాయిలో సరఫరా చేయలేదని అన్నారు. ప్రతి ఏటా మన దేశంలో లక్ష కోట్ల రూపాయలు పామాయిల్ దిగుమతి అవుతోందని వివరించారు. పామాయిల్ ఇంపోర్ట్ ట్యాక్స్ పెంచితే మన రైతాంగానికి మద్దతు ధర పెరుగుతుందని మంత్రి తుమ్మల అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణకు పామాయిల్ సాగు వరంగా మారుతుందని చెప్పుకొచ్చారు. లక్షలాది రైతుల తలరాత మారేలా పామాయిల్ సాగు విస్తరణ చేసే అవకాశం భగవంతుడు తనకు ఇచ్చారని తెలిపారు. ఎన్ని పదవులు చేశామని కాదని.. ముందు తరాలకు మేలు చేసేలా తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని ఉద్ఘాటించారు. మంత్రిగా నలభై ఏళ్ల ప్రస్థానంలో భద్రాద్రి శ్రీ రాముడు దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని చెప్పుకొచ్చారు. తన చివరి శ్వాస వరకు ప్రజాసేవలో ఉంటానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో తనకు సహకరించిన ముఖ్యమంత్రులు, అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

# అత్యుత్తమ మార్కులు సాధించిన బిసి విద్యార్థులు

**ప్రతిభా పురస్కారాలు అందచేసిన మంత్రులు**




**హైదరాబాద్,మే14:** బంజారాహిల్స్ కొమురంభీం భవన్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్,వాకిటి శ్రీహరిలు వీటిని అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు,బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి మాట్లాడుతూ.. విద్య వినయాన్ని ఇస్తుంది, వినయం వ్యక్తిని గొప్పవాడిని చేస్తుందని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకు వస్తుందని నెల్సన్ మండేలా, మహాత్మా జ్యోతిరావు పూలే లు చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణ రైజింగ్ లో ప్రతి విద్యార్థి భాగం కావాలి. విద్య ఎవరి సొత్తు కాదు, సరస్వతీ దేవికి రంగు, రూపు తేడా ఉండదు. విద్యపై మనం చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుంది. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం కనుక 100శాతం ఉత్తీర్ణత సాధించాలి.అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలి. 100 సంవత్సరాలుగా చేయని కులగణన ను ప్రజా ప్రభుత్వం చేసింది. విద్యలో ఒత్తిడి ఉండొద్దని 25 వేల మంది టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చాం అవకాశాన్ని సృష్టించుకున్నవాళ్లే సమర్థులు అవుతారు.రాజకీయాలు అనగానే ఒక ధోరణి ని విడనాడాలి. భవిష్యత్ లో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై చట్టాలు చేయాలి.

రాజకీయ నాయకులు చేసే చట్టాలు దేశ భవిష్యత్తును మారుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం విప్లవాత్మకంగా మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీహరి వివరించారు.

# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకం

**తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు**

**మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి**

**వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై మహిళలకు అవకాశాలు**

**హెవీ మోటార్ వెహికిల్ శిక్షణను పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు**

**హైదరాబాద్,మే14 :** మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం మగ ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఎందుకంటే ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని, వారి నైపుణ్యాలను, శక్తి సామర్థ్యాలను కూడా వినియోగించడానికి తగు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను కోరింది. మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (ట్రైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. ఈ-ుక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా ఆ దిశగా కీలక అడుగులు వేస్తోంది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించటానికి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది, ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ, భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంత భయపడినప్పటికీ,

స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మల్లు ల ఆదేశాల మేరకు సింగరేణిలో మహిళా శక్తికి తగిన అవకాశాలు కల్పిస్తూ వస్తున్నామని, బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారని, అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



# చివరిగింజ వరకు కొంటాం

**పొంగులేటితో కలసి పాలేరు ధాన్యం కనుగోళ్లు పరిశీలన**

**ఖమ్మం,మే14 :** రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.

# కేరళ సిఎం అభ్యర్థి సతీషన్‌కు రేవంత్ అభినందనలు

**ఆయనకు పదవి దక్కడం సముచిత గుర్తింపు అని వెల్లడి**

**హైదరాబాద్,మే14 :** కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ... విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా

**గతంలో లేని సమస్యలు ఇప్పడే ఎందుకు**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి కొప్పుల**



**పెద్దపల్లి,మే14 :** కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత పాలన వల్ల రాష్ట్రంలోని రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడే ఎందుకని ప్రశ్నించారు. పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో లేని ఇబ్బందులు రేవంత్ పాలనలో ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ యకత్వంలో నీళ్లు, 24 గంటల కరెంట్, పంట పెట్టుబడి, ఎరువులు సకాలంలో అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక అంతా ఆగిపోయిందని విమర్శిం చారు. ప్రభుత్వం సక్రమంగా, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం పంట కళ్లాలోనే కుప్పల, తెప్పలుగా పోసి ఉంటున్నాయని, వర్షాల భయంతో రైతులు అరచేతుల్లో ప్రాణం పెట్టుకుని లారీల కోసం ఎదురుచూపు చూస్తున్నారని తెలిపారు. అంతేగాక బస్తాకు 3.2 కేజీ కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ మంత్రి, కలెక్టర్, కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల పట్టింపు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల్లో రైతు డిక్లరేషన్ పేరుతో 36 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆయన గుర్తు చేశారు .

# ఎసిబికి చిక్కిన మరో లంచావతారం


**10వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**వరంగల్,మే 14 :** పూర్వీకుల ఆస్తిని తన పేరుపై మ్యూటేషన్ కోసం సంప్రదించిన బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తహసీల్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న జి రాంబాబు బాధితుడి నుంచి రూ. 10 వేలు తీసుకుంటుండగా గురువారం వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని ఆర్ఐపై కేసు నమోదు చేసి వరంగల్ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీబీ అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 అనే నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వాట్సప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# కేరళ సీఎంగా వీడీ సతీశన్

## ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్

## పదరోజుల కసరత్తు అనంతరం ప్రకటన



**తిరువనంతపురం :** కేరళ సీఎం పోస్టుపై ఉత్కంఠ వీడింది. ఆ రాష్ట్రానికి తదుపరి సీఎంగా వీడీ సతీశన్ ను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఈ పదవి కోసం కె.సి.వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరకు సతీశన్‌నే ముఖ్యమంత్రి పదవి వరించింది. గత నెలలో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించింది. మొత్తం 140 స్థానాల్లో పోటీపడిన ఈ కూటమి 102 చోట్ల విజయం సాధించింది. అయితే ముఖ్యమంత్రి పదవికి పోటీ ఎక్కువగా ఉ ండటంతో సతీశన్ ఎంపికకు అధిష్ఠానం పది రోజుల సమయం తీసుకోవడం గమనార్హం. కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. మంచి వక్తగానూ గుర్తింపు వచ్చింది. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, ఎలాంటి గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. పాలనాపరంగా ఎలాంటి అనుభవం లేని సతీశన్‌ను ప్రతిపక్ష నేతగా నియమిస్తూ తీసుకున్న నిర్ణయంపై అప్పట్లో పలువురు అనుమానం వ్యక్తంచేశారు. కానీ ఎల్‌డీఎఫ్‌ను ఎదుర్కొనే నేతగా తనను తాను నిరూపించుకున్నారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరాజయాలతో సతమతమవుతుంటే.. రాష్ట్రంలో మాత్రం హస్తం పార్టీ శ్రేణుల్లో ఆయన ఉత్సాహం నింపారని రాజకీయ విమర్శకులే అంగీకరించిన సందర్భాలున్నాయి. ఎన్నికల వేళ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించిన.. విజయన్(ఖతినిజీసజాతి ÷ఎతితీజాజీని) కు ప్రధాన పోటీదారుగా తనను తాను నిరూపించుకున్నారు. క్షేత్రస్థాయిలోకి బలంగా చొచ్చుకెళ్లారు. అందుకే సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఇదే విషయం వెల్లడైంది. పార్టీ ఎమ్మెల్యేల్లో అత్యధికులు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ నాయకత్వం వైపు మొగ్గు చూపగా, ప్రజల్లో మటుకు సతీశన్ పేరు ఎక్కువగా వినిపించింది. దాంతో ప్రజాభిప్రాయం వైపే మొగ్గు చూపిన అధిష్ఠానం చివరకు ఆయన్నే సీఎం పదవికి ఎంపిక చేయాల్సివచ్చింది.

# ఢిల్లీలో మరో నిర్భయ ఘటన

## వివాహితపై డ్రైవర్, కండక్టర్ అత్యాచారం

**న్యూఢిల్లీ :** రాజధాని ఢిల్లీ మరోమారు నిర్భయ లాంటి ఘటన చోటుచేసుకుంది. తాజాగా షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. బస్సు డ్రైవర్, కండక్టర్ తనపై అత్యాచారం చేశారని ఒక వివాహిత ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నగరంలోని రాణీబాగ్ ప్రాంతంలో సోమవారం రాత్రి ఈ దారుణం జరిగింది. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, ఆమె మంగోల్‌పురిలోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. పీతమ్‌పురాలో నివసిస్తున్నారు. ఆమెకు ముగ్గురు పిల్లలు. కాగా, సోమవారం రాత్రి విధులు ముగించుకున్న ఆమె తిరిగివస్తుండగా సరస్వతీ విహార్ వద్ద ఒక స్లీపర్ బస్సు వచ్చి ఆగింది. బస్సు డోర్ వద్ద నిలబడి ఉన్న వ్యక్తి మొదట బాధితురాలిని టైమ్ అడిగి ఆ తరువాత బలవంతంగా బస్సులోకి ఎక్కించాడు. ఆ తరువాత బస్సును నాంగ్లోయి ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నిందితులు అఘాయిత్యానికి ఒడిగట్టారు. బాధితురాలికి వైద్య పరీక్షల అనంతరం పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. కేసుపై దర్యాప్తు ప్రారంభించారు.

# చక్కెర ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం

## ఎగుమతులను నిషేధిస్తూ ఉత్తర్వులు

**న్యూఢిల్లీ,మే 14 :** పంచదార ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎగుమతులను తక్షణం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. దేశీయంగా చక్కెర ధరలు పెరగకుండా, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ముడి, తెల్ల, శుద్ధి చేసిన చక్కెరలకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టంచేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వులకు ముందే లోడింగ్ ప్రారంభమైనా, చక్కెర నిల్వలను కస్టమ్స్‌కు అప్పగించినా వాటి ఎగుమతులకు అనుమతిస్తామని వెల్లడించింది. కాగా.. ఇప్పటికే కుదిరిన ఒప్పందాల ప్రకారం ఐరోపా, అమెరికాకు ఈ ఎగుమతుల నిషేధం వర్తించదని ప్రభుత్వం పేర్కొంది.

# హయత్‌నగర్‌లో భారీ అగ్నిప్రమాదం

## ఎలక్ట్రికల్ షాపులో షాట్ సర్క్యూట్‌తో మంటలు

**హైదరాబాద్ :** హయత్ నగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపులో మొదలైన మంటలు.. క్షణాల్లోనే పక్కనే ఉన్న పరుపుల షాపుకు విస్తరించి భీభత్సాన్ని సృష్టించాయి. ఎగిసిపడుతున్న మంటలు, దట్టమైన పొగతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముందుగా జయశ్రీ ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ షాపులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న పరుపుల తయారీ షాపుకు వ్యాపించడంతో ప్రమాద తీవ్రత రెట్టింపైంది. పరుపులు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి.. ఆ రెండు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల ధాటికి సమీపంలోని మరో రెండు షాపులు కూడా స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో షాపుల బయట నిలిపి ఉంచిన ఒక బైక్ కూడా పూర్తిగా కాలి బూడిదైపోయింది. సమాచారం అందుకున్న వెంటనే హయత్ నగర్ అగ్నిప్రమాద సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు. అయితే, షాపు లోపల పరుపుల నిల్వలు ఉండటంతో.. మంటలు ఆరిపోయినట్టే కనిపిస్తూనే మళ్ళీ మళ్ళీ రాజుకున్నాయి. ఈఘటనలో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రస్తుతం ÷ర్ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తూ మంటలు పూర్తిగా ఆరిపోయేలా చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

## తనకుమంచి స్నేహితుడని అంటూ పొగడ్తలు

## ఇరు దేశాల మధ్య శిఖరాగ్ర సదస్సులో ట్రంప్



**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్‌ను కలవడం తనకు గౌరవమని, ఆయన తనకు మంచి స్నేహితుడని కొనియాడారు. ఇరు దేశాలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. 'మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పొరపొచ్చాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించాము. మీరు ఒక గొప్ప నాయకుడు. ఇలా నేను మిమ్మల్ని ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ నేను ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. చైనా, అమెరికాలు కలిసికట్టుగా అద్భుత భవిష్యత్తువైపు అడుగులు వేస్తున్నాయి ' అని ట్రంప్ అన్నారు. ఈ పర్యటన కోసం తాను అమెరికాకు చెందిన అత్యుత్తమ వ్యాపారవేత్తలను తీసుకొచ్చానని కూడా ట్రంప్ చెప్పారు. వారందరికీ చైనా అధినేత అంటే గౌరవమని చెప్పారు. ఇదే అతిపెద్ద శిఖరాగ్ర సమావేశమని కూడా వ్యాఖ్యానించారు. ఇక ఈ సమావేశాల ప్రారంభంలో చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉండాలని అభిలషించారు. చైనా-యూఎస్ బంధం స్థిరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. గత శతాబ్దంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు ఉన్నాయని, ప్రపంచం నాలుగు రోడ్ల కూడలిలో ఉందని అభిప్రాయపడ్డారు. చైనా, యూఎస్‌లు తమ దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కూడా వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎన్‌విడియా సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీతో పాటు తైవాన్ అంశంపై కూడా చర్చించేందుకు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాలను చైనాకు మరింతగా ఎగుమతి చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

# 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

## జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన



**న్యూఢిల్లీ :** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

# పొదుపు మంత్రంపై మహా సిఎం వినూత్న ప్రయోగం

## రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై విధాన సభకు పయనం



**ముంబై :** పశ్చిమాసియా సంక్షోభంతో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రం పాటిస్తున్న సంగతి తెలిసిందే. పెట్రోల్, గ్యాస్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ఇటీవల భారతదేశ ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాలు మోదీ పిలుపును ఆహ్వానించాయి. ఈ మేరకు ముఖ్యమంత్రులు, మంత్రులు తమ కాన్వాయ్‌ల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఒక అడుగు ముందుకేసి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కార్ల కాన్వాయ్‌కి బదులుగా ద్విచక్రవాహనాలను ఎంచుకున్నారు. గురువారం మహారాష్ట్ర శాసన మండలికి కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తన అధికారిక నివాసం నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విధాన భవన్‌కు వెళ్లారు. సీఎంతో పాటు మంత్రి ఆశిష్ షెలార్, భద్రతా సిబ్బంది కూడా ద్విచక్రవాహనాలపై శాసన మండలికి చేరుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎక్స్ వేదికగా ఫడ్నవీస్ పోస్టు చేశారు. 'ప్రధాని మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా దేశం కోసం ఇది నా వంతు సహకారం. ప్రతి ఒక్కరూ దేశం కోసం తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా' అంటూ ఆయన పోస్టు చేశారు. కాగా, ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగాన్ని తగ్గించాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా ఆయన తన కాన్వాయ్‌ని 15 నుంచి కేవలం రెండు కార్లకు తగ్గించారు. తాజా కాన్వాయ్‌లో రేంజ్ రోవర్, టయోటా ఫార్చ్యూనర్ మాత్రమే ఉన్నాయి. ప్రధాని పిలుపుతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు కూడా తమ కాన్వాయ్‌ల సంఖ్యను తగ్గించుకున్నారు. మరోవైపు ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులపై ఆంక్షలు విధించింది. ప్రభుత్వ క్వార్టర్ల నుంచి కార్యాలయాలకు వెళ్లేందుకు మెట్రోస్టేషన్ల మీదుగా ప్రత్యేక షటిల్ బస్సులను వినియోగించాలని తెలిపింది. ప్రజలు కూడా కార్లలో కాకుండా బస్సులు, మెట్రోలో ప్రయాణించాలని విజ్ఞప్తి చేసింది.

# పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం

## వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్

## వారానికి ఒకరోజు నో వెహికిల్ డే

## సిఎం రేఖాగుప్తా పలు నిర్ణయాలు ప్రకటన

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ప్రజా రవాణా వినియోగంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కూడా కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పొదుపు సూత్రాల పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆధ్వర్యంలో తీసుకున్న ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహంపై కేంద్రీకృతమై ఉన్నాయి. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ఇంధన వినియోగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగులకు వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రేపటి నుంచే అమల్లోకి వస్తుందని సీఎం రేఖా గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనాల సంఖ్య తగ్గి, కాలుష్య నియంత్రణకు తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా సీఎం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేశారు. ఇందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని నిర్ణయించారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. పౌరుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 'నా భారతదేశం ? నా కర్తవ్యం' పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ఢిల్లీ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగనుంది. ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక కార్యక్రమంగా అమలు చేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజారవాణా వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ తగ్గించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికిల్ డే' పాటించాలని ప్రభుత్వం సూచించింది. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సైకిళ్లు, మెట్రో, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను వినియోగించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు వచ్చే ఆరు నెలల వరకు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైతే ఇప్పటికే ఉన్న వాహనాలనే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇది ప్రభుత్వ ఖర్చులను తగ్గించడమే కాకుండా, వనరుల సమర్థ వినియోగానికి దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని విదేశీ అధికారిక పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీ ఇప్పటికే వాయు కాలుష్య సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, మెట్రో వినియోగం, నో వెహికిల్ డే వంటి చర్యలతో వాహనాల సంఖ్య తగ్గి కాలుష్యం నియంత్రణలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

# పంజాబ్‌కు వరుసగా ఐదో ఓటమి

## ముంబైని గెలిపించిన తిలక్ వర్మ
## శార్దూల్‌కు నాలుగు వికెట్లు





ధర్మశాల: ఒకటా.. రెండా వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో ఓటమి లేకుండా (ఒక మ్యాచ్ రద్దు) దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్ పరిస్థితి దయనీయంగా మారింది. అందరికంటే ముందు ప్లేఆఫ్స్‌కు వెళ్తుందనుకున్న జట్టుకు ఇప్పుడు ఆ అవకాశమే ప్రమాదంలో పడింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో తిలక్ వర్మ (33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75 నాటౌట్) అదరగొట్టడంతో పంజాబ్‌పై ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో గెలిచింది. శ్రేయాస్ సేనకిది వరుసగా ఐదో ఓటమి. దీంతో 13 పాయింట్లతో ఉన్న ఈ జట్టు చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా.. చెన్నై, రాజస్థాన్‌లతో గట్టి పోటీ ఎదురుకానుంది. టాస్ కోల్పోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 200 పరుగులు చేసింది. ప్రభ్‌సిమ్రన్ (32 బంతుల్లో 57), ఒమర్జాయ్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38), ప్రియాన్ష్ (17 బంతుల్లో 22) రాణించారు. పేసర్ శార్దూల్‌కు నాలుగు, దీపక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసి గెలిచింది. రికెల్టన్ (23 బంతుల్లో 48), విల్ జాక్స్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25 నాటౌట్) వేగం చూపారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు. అలాగే ముంబై జట్టుకు బుమ్రా తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించడం విశేషం.

### తిలక్ అండతో..:

భారీ ఛేదనలో ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ (25) శుభారంభం అందించగా.. చివర్లో తిలక్ ఒత్తిడిని అధిగమిస్తూ జట్టుకు చక్కటి విజయాన్నందించాడు. స్వల్ప వ్యవధిలో రికెల్టన్, నమన్ (9)లతో పాటు రోహిత్ వెనుదిరగడంతో 88/3 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో తిలక్ వర్మ రూథర్‌ఫోర్డ్ (20)తో కలిసి నాలుగో వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. 18వ ఓవర్‌లో తిలక్ 6,4,6తో 22 పరుగులు రావడంతో సమీకరణం 6 బంతుల్లో 15 పరుగులకు మారింది. జాక్స్ 4, తిలక్ 6,6తో మరో బంతి ఉండగానే మ్యాచ్ ముగిసింది.

### చివర్లో విధ్వంసం:

పంజాబ్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్ రాణించినా.. ముంబై పేసర్ల ధాటికి మిడిలార్డర్ తడబడింది. ముఖ్యంగా శార్దూల్ జట్టును కుదురుకోనీయలేదు. కానీ డెత్ ఓవర్లలో ముం బై బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. టెయిలెండర్ల హిట్టింగ్‌తో జట్టు స్కోరు 200కి చేరింది. దీనికితోడు ముంబై ఫీల్డింగ్ వైఫల్యం కూడా కలిసివచ్చింది. ఇక రెండో ఓవర్‌లోనే వెనుదిరగాల్సిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ మరో ఓపెనర్ ప్రియాన్ష్‌తో కలిసి తను తొలి వికెట్‌కు 52 పరుగులు జోడించాడు. కానీ ప్రియాన్ష్‌ను పేసర్ చాహర్ బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలో 55/1 స్కోరుతో నిలిచింది. స్పిన్నర్ రఘు ఓవర్‌లో రెండు, బాష్ ఓవర్‌లో ఓ సిక్స్ బాదిన ప్రభ్‌సిమ్రన్ 29 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే 12వ ఓవర్‌లో ప్రభ్‌తో పాటు కెప్టెన్ శ్రేయాస్ (4)ను అవుట్ చేసిన పేసర్ శార్దూల్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. ఆ తర్వాత కూడా కూపర్, శార్దూల్ చెలరేగడంతో మొత్తంగా 40 పరుగుల తేడాతో ఆరు వికెట్లను కోల్పోయింది. ఈ స్థితిలో 140/7 స్కోరుతో నిలిచిన పంజాబ్‌కు 180 కూడా కష్టమే అనిపించింది. కానీ చివరి 3 ఓవర్లలో సీన్ మారిపోయింది. 18వ ఓవర్‌లో ఒమర్జాయ్ 4,6,6 బాది అవుటయ్యాడు. ఆ ఓవర్‌లో 19 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లో విష్ణు (15 నాటౌట్), బార్ట్‌లెట్ (18 నాటౌట్) ధాటికి 22 రన్స్ వచ్చాయి. బుమ్రా ఆఖరి ఓవర్‌లో 12 రన్స్ రాగా పంజాబ్ ఒక్కసారిగా భారీ స్కోరందుకుంది.

### స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (బి) చాహర్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) బాష్ (బి) శార్దూల్ 57, కూపర్ (బి) రాజ్ బవా 21, శ్రేయాస్ (బి) శార్దూల్ 4, సూర్యాన్ష్ (సి) రాజ్ బవా (బి) శార్దూల్ 8, శశాంక్ (ఎల్బీ) బాష్ 2, ఒమర్జాయ్ (సి) జాక్స్ (బి) చాహర్ 38, యాన్సెన్ (బి) శార్దూల్ 2, విష్ణు వినోద్ (నాటౌట్) 15, బార్ట్‌లెట్ (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 200/8; వికెట్ల పతనం: 1-50, 2-107, 3-111, 4-111, 5-123, 6-135, 7-140, 8-166; బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-36-2, బుమ్రా 4-0-35-0, శార్దూల్ 4-0-39-4, బాష్ 4-0-42-1, రఘు శర్మ 2-0-22-0, జాక్స్ 1-0-9-0, రాజ్ బవా 1-0-11-1.

ముంబై: రోహిత్ (బి) చాహల్ 25, రికెల్టన్ (సి) ప్రియాన్ష్ (బి) ఒమర్జాయ్ 48, నమన్ (సి) అర్ష్‌దీప్ (బి) యాన్సెన్ 9, తిలక్ (నాటౌట్) 75, రూథర్‌ఫోర్డ్ (సి) బార్ట్‌లెట్ (బి) ఒమర్జాయ్ 20, జాక్స్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.5 ఓవర్లలో 205/4. వికెట్ల పతనం: 1-61, 2-81, 3-88, 4-149; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-29-0, ఒమర్జాయ్ 4-0-36-2, యాన్సెన్ 4-0-55-1, బార్ట్‌లెట్ 3.5-0-53-0, చాహల్ 4-0-32-1.

# తిలక్ వర్మకు భారత్ 'ఎ' పగ్గాలు

## వైభవ్‌కు చోటు
## శ్రీలంకలో ముక్కోణపు వన్డే సిరీస్

న్యూఢిల్లీ: వచ్చే నెలలో శ్రీలంక వేదికగా 'ఎ' జట్ల ముక్కోణపు వన్డే టోర్నీ జరగనుంది. జూన్ తొమ్మిదిన ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్‌లో భారత్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ 'ఎ' జట్లు తలపడనున్నాయి. ఈ సిరీస్‌లో పాల్గొనే భారత్ 'ఎ' జట్టును గురువారం ప్రకటించారు. హైదరాబాదీ తిలక్ వర్మను కెప్టెన్‌గా నియమించారు. రియాన్ పరాగ్ వైస్-కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జట్టులో స్థానం కల్పించారు. మ్యాచ్‌లన్నీ దంబుల్లాలో జరుగుతాయి. ప్రతి జట్టు మిగతా రెండు టీమ్‌లతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు జూన్ 21న జరిగే ఫైనల్లో తలపడతాయి.



ముక్కోణపు టోర్నీ అనంతరం భారత్, శ్రీలంక 'ఎ' జట్లు నాలుగు రోజులు సాగే రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో ఢీకొంటాయి. గాలెలో జరిగే ఈ రెండు టెస్ట్‌లకు భారత జట్టును తర్వాత ప్రకటిస్తారు.

### భారత్ 'ఎ' జట్టు

తిలక్ వర్మ (కెప్టెన్), రియాన్ పరాగ్ (వైస్-కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (కీపర్), సూర్యాన్ష్ షెడ్గే, హర్ష్ దూబే, నిషాంత్ సిద్ధూ, అర్షద్ ఖాన్, ఆయుష్ బదోనీ, కుమార్ కుశాగ్ర (కీపర్), విప్రజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్.

# క్వార్టర్స్‌లో సింధు, లక్ష్య

## సాత్విక్ జోడీ కూడా..
## శ్రీకాంత్ అవుట్



బ్యాంకాక్: ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ తోపాటు సాత్విక్ జోడీ థాయ్ ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకోగా.. కిడాంబి శ్రీకాంత్ ఇంటిదారి పట్టాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో ఆరో సీడ్ సింధు 21-13, 21-15తో అమలి షుల్జ్ (డెన్మార్క్)పై గెలిచింది. అయితే, దేవిక సిహాగ్ 21-23, 11-21తో ఒపట్నీపుత్ (థాయ్) చేతిలో, మాళవిక 12-21, 7-21తో చెన్ చేతిలో, శ్రీకాంత్ 16-21, 21-11, 8-21తో సు లి యంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడారు. ఏడో సీడ్ లక్ష్య సేన్ 21-12, 21-13తో జు జువాన్ చెన్ (చైనా)పై విజయం సాధించాడు. ఇక, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 21-12, 21-19తో మలేసియాకు చెందిన జెర్మీ గూంటింగ్-మహ్మద్ హైకాల్‌పై గెలిచింది.

# నిఖత్‌కు షాక్

## ట్రయల్స్‌లో ఓటమి.. కామన్వెల్త్, ఆసియాడ్ ఆశలు ఆవిరి




పటియాలా: రెండుసార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు షాక్ తగిలింది. కామన్వెల్త్, ఆసియా క్రీడల ట్రయల్స్ నుంచి ఆమె అవుటైంది. బుధవారం జరిగిన మహిళల 51 కిలోల సెమీస్‌లో నిఖత్ 1-4తో సాక్షి చౌదరి చేతిలో ఓడింది. దీంతో కామన్వెల్త్, ఆసియాడ్‌లో ఆడే అవకాశం కోల్పోయింది. ప్రదర్శన ఆధారిత విధానంపై తీవ్ర విమర్శలు రావడంతో.. భారత బాక్సింగ్ సమాఖ్య మళ్లీ ట్రయల్స్ విధానాన్ని తీసుకొచ్చింది. 54 కిలోల్లో నీతూ ఘంఘాస్, వరల్డ్‌కప్ పతక విజేత హితేష్ గులియా (70 కి)కు కూడా ట్రయల్స్‌లో చుక్కెదురైంది. సెమీస్‌లో మీనాక్షి చేతిలో నీతూ ఓడగా.. సుమీత్ చేతిలో హితేష్ పరాజయం పాలయ్యాడు. మహిళల 65 కిలోల సెమీస్‌లో అనుక్షిత బోరోపై ఆసియాడ్ పతక విజేత పర్వీన్ హుడా గెలవగా.. 80 కిలోల్లో నైనా చేతిలో పూజా రాణి ఓడింది. కాగా, సచిన్ సివాచ్ (60 కి), ప్రీతి పవార్ (54 కి), ప్రియ ఘంఘాస్ (60 కి) గత నెలలో మంగోలియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ఫైనల్స్ చేరడం ద్వారా కామన్వెల్త్, ఆసియాడ్‌కు అర్హత సాధించారు. వరల్డ్ చాంపియన్ జాస్మిన్ లంబోరియా (57 కి), అరుంధతి చౌదరి (70 కి) కామన్వెల్త్ బెర్త్‌లు దక్కాయి. ఈ రెండు వెయిట్ కేటగిరీలు ఆసియాడ్‌లో లేవు. కాగా, ట్రయల్స్‌లో నెగ్గిన బాక్సర్లను చెక్ రిపబ్లిక్‌లో జరిగే ప్రత్యేక క్యాంప్‌నకు పంపనున్నారు. ఇక, ద్వితీయ శ్రేణి బాక్సర్లు వచ్చే నెల 15 నుంచి జరిగే వరల్డ్ బాక్సింగ్ కప్‌లో ఆడనున్నారు.

# శ్రీజేష్ స్థానంలో సోయెజ్

## జూ.హాకీ జట్టు కోచ్‌గా నియామకం

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్‌కు చెందిన ఫ్రెడెరిక్ సోయెజ్ భారత జూనియర్ హాకీ జట్టు కొత్త కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈమేరకు హాకీ ఇండియా (హెచ్ఐ) గురువారం ప్రకటించింది. శ్రీజేష్ స్థానంలో అతడు బాధ్యతలు చేపట్టనున్నాడు. 48 ఏళ్ల ఫ్రెడెరిక్ 1995 నుంచి 2010 వరకు 196 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఫ్రాన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 15 ఏళ్ల కెరీర్‌లో 195 గోల్స్ చేశాడు. రిటైర్ అయిన అనంతరం కోచ్‌గా స్థిరపడ్డాడు. ఫ్రాన్స్, స్పెయిన్ పురుషుల జాతీయ జట్లకు కోచ్‌గా వ్యవహరించాడు. కాగా..హాకీ ఇండియా కుటుంబంలోకి సోయెజ్‌ను సాదరంగా స్వాగతిస్తున్నట్టు అధ్యక్షుడు దిలీప్ టిర్కే పేర్కొన్నాడు.



# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

## ముంబైలో ఒకటి.. భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళు న్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷-లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ-సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

# విరోష్ జోడీ.. యాడ్‌కు విశేష స్పందన

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడీ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. అభిమానులు ప్రేమగా 'విరోష్' అని పిలుచుకునే ఈ జంట తాజాగా కలిసి చేసిన ఎయిర్‌బీఎన్‌బీ కపుల్ యాడ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డు స్థాయిలో స్పందన అందుకుంటోంది. ఈ యాడ్ పోస్టుకు ఇప్పటికే 9.1 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక లైక్స్ సాధించిన యాడ్ పోస్టుల్లో ఇది రెండో స్థానంలో నిలిచినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మొదటి స్థానంలో కూడా విజయ్-రష్మిక జంటే ఉండటం అభిమానులను మరింత ఆనందం కలిగిస్తుంది. గతంలో ఈ జంట కలిసి చేసిన మాన్యవార్ వెడ్డింగ్ క్యాంపెయిన్ యాడ్ సోషల్ మీడియాలో భారీ రికార్డులు సృష్టించింది. ఆ యాడ్ పోస్టుకు 11.5 మిలియన్లకు పైగా లైక్స్ రావడంతో పాటు 100 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కాయి. అప్పట్లో అది సోషల్ మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో కలిసి చేసిన లూయిస్ విట్టన్ యాడ్ పోస్టులతో పోలిస్తే.. విజయ్-రష్మిక యాడ్స్‌కు ఎక్కువ రెస్పాన్స్ రావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్థాయి స్పందన రావడానికి ప్రధాన కారణం వీరిద్దరికీ ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్ధన్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో రష్మిక మందన్నతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక రష్మిక మందన్న కూడా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్‌లో షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటిస్తుండగా, తెలుగులో 'మైసా' చిత్రంలో కనిపించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో వరుస అవకాశాలు అందుకుంటూ ఆమె కెరీర్ దూసుకెళ్తోంది.





# కేడీ ట్రైలర్ విడుదల

ధ్రువ్ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కేడీ: ది డెవిల్' మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ దత్ కీలకపాత్రలో నటించారు. తాజాగా దీని తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇది అంతం కాదు.. ఆరంభం' అని ధ్రువ్ తన డైలాగులతో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలోని ఓ పాట పలు వివాదాలకు కారణమైన విషయం తెలిసిందే. దాన్ని అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ తొలగించారు. దీంతో తెలుగులో ఆ పాటను ఉంచుతారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.



# కురుప్పు విడుదలకు ముందే ఇబ్బందులు

## చివరి నిముషంలో షోలు రద్దు



తమిళ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం కరుప్పు విడుదలకు ముందే అనూహ్య ఇబ్బందుల్లో చిక్కుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజి తెరకెక్కించిన ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ విడుదలకు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు సమాచారం. తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న విజయ్ ప్రభుత్వం ఉదయం 9 గంటల స్పెషల్ షోలకు పర్మిషన్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా ఒక్క షో పడకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. బుక్‌మైషోలో ఉదయం ఆటలకు సంబంధించిన బుకింగ్స్ కనిపించకపోవడంతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో కూడా పలు థియేటర్లలో మార్నింగ్ షోలు క్యాన్సిల్ అయ్యాయి. మ్యాట్నీ షోల బుకింగ్స్ కూడా రద్దు చేసినట్లు సమాచారం. ఓవర్సీస్‌లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అమెరికాలో ప్రీమియర్ షోలు నిలిపివేయడంతో పాటు, వీకెండ్ బుకింగ్స్‌పై కూడా అనిశ్చితి నెలకొంది. దీంతో సినిమా రిలీజ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాలపై నిర్మాత ఎస్ఆర్ ప్రభు సోషల్ మీడియాలో స్పందించారు. 'అనివార్య కారణాల వల్ల ఉదయం 9 గంటల ప్రదర్శనలు రద్దు చేయబడ్డాయి. అందరికీ మా హృదయపూర్వక క్షమాపణలు' అంటూ ట్వీట్ చేశారు. అయితే తదుపరి షోలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ సినిమాకు సంబంధించి నిర్మాతల పాత బకాయిలే ప్రస్తుతం సమస్యలకు కారణమయ్యాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

# చాక్లెట్ డ్రెస్‌లో ప్రగ్యా జైస్వాల్ 'కోకో' మ్యాజిక్!

తెలుగు తెరపై 'కంచె'తో క్లాస్ లుక్, 'అఖండ'తో మాస్ హిట్ అందుకున్న పొడుగుకాళ్ల సుందరి ప్రగ్యా జైస్వాల్, సోషల్ మీడియాలో మరోసారి హీట్ పెంచేసింది. తాజాగా ఆమె షేర్ చేసిన "కోకో కోచర్" ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. చాక్లెట్ బ్రౌన్ కలర్ డ్రెస్సులో మెరిసిపోతున్న ప్రగ్యా..మరి ఆ అద్భుతమైన డ్రెస్ విశేషాలు మీకోసం.. ప్రగ్యా ఈసారి ఎంచుకున్న డ్రెస్ చాలా వెరైటీగా ఉంది. ప్రముఖ డిజైనర్ బబితా మల్కాని డిజైన్ చేసిన ఈ 'చాక్లెట్ బ్రౌన్ కోచర్' డ్రెస్ ఆమె ఫిగర్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. ఇక ప్రీమియం సాటిన్ మరియు ఫాయిల్ జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన ఈ గౌన్, ప్రగ్యాకు ఒక లగ్జరీ లుక్‌ను ఇచ్చింది. ముఖ్యంగా ఆ డ్రెస్సు రంగు ఆమె స్కిన్ టోన్‌కు మరింత గ్లోను జోడించింది.

# ధాన్యం కొనుగోళ్లకు వేగం పెంచాలి

## రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి

## మిల్లుల వద్ద యుద్ధ ప్రాతిపదికన అన్‌లోడింగ్ చేపట్టాలి



కరీంనగర్, మే 15: చొప్పదండి మార్కెట్ యార్డు, అర్కనకొండలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన అధికారులు ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి, రవాణా, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైనన్ని లారీలను సమకూర్చి ధాన్యాన్ని వెంటనే తరలించాలని, మిల్లుల వద్ద యుద్ధ ప్రాతిపదికన అన్‌లోడింగ్ నిర్వహించాలని తెలిపారు. రవాణా ప్రక్రియలో జాప్యం లేకుండా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అవసరమైతే ట్రాక్టర్లను పెద్ద ఎత్తున వినియోగించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఎలాంటి కటింగులు, కోతలు లేకుండా రైతులకు పూర్తి పారదర్శకంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కోరారు. ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం, ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్, తహసీల్దార్ నవీన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.



# మిషన్ మోడ్‌లో ధాన్యం లిఫ్టింగ్ చేపట్టాలి

## మూడు రోజుల్లో మిల్లులకు తరలింపు పూర్తి చేయాలి

## పెద్ద ఎత్తున లారీలు సమకూర్చి వెంట వెంటనే రవాణా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, మే 15: గంగాధర మార్కెట్ యార్డు, మధురనగర్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన అధికారులు కొనుగోళ్ల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల డెడ్‌లైన్ ప్రకారం ముమ్మరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మూడు రోజుల్లోగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా పెద్ద ఎత్తున లారీలను సమకూర్చి వెంట వెంటనే రవాణా చేపట్టాలని తెలిపారు. మిల్లుల వద్ద కూడా వేగంగా అన్‌లోడింగ్ జరిగేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు, రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ధాన్యం అన్‌లోడింగ్ సందర్భంగా మిల్లర్లు ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి త్వరితగతిన మిల్లులకు తరలించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. లారీల కొరత రాకుండా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేయాలని కోరారు. చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే. మహేశ్వర్, పౌరసరఫరాల జిల్లా అధికారి నర్సింగరావు, డీఎం రజనీకాంత్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడిలో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలి

## అడిషన్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




అంగన్వాడీ కేంద్రాల్లో పెండింగ్లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీల్లో టాయిలెట్ కాంపౌండ్ వాల్ తదితర పెండింగ్ వర్క్స్ పూర్తి చేయాలని తెలిపారు. నేరేగా పథకం క్రింద అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేసి ఈ నెల 29 న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గల్లో ప్రారంభించి, వచ్చే నెల నుండి పూర్వ ప్రాథమిక విద్య సమగ్రంగా అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. బరువు తక్కువగా ఉన్న శిశువులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పూర్తిగా బరువు తక్కువ ఉన్న వారిని ఎన్.ఆర్.సి సెంటర్లకు రిఫర్ చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, బాల్య వివాహాలు లేని మండలాలుగా ప్రకటించేందుకు కృషి చేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ కమిటీలను బలోపేతం చేయాలని తెలిపారు. సఖి కేంద్రంలోని సేవలను మరింత విస్తృతం చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపివోలు సబిత, సుగుణ, నర్సింగరాణి, శ్రీలత, డీసీపీవో పర్వీన్, సఖీ సెంటర్ అడ్మిన్ లక్ష్మి, డి హెచ్ ఈ డబుల్యూ కోఆర్డినేటర్ శ్రీలత, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్ మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారు

# లిఫ్ట్ ఘటన నేపథ్యంలో వన్ ఆస్పత్రికి షోకాస్ నోటీసు

## ప్రైవేట్ ఆస్పత్రుల భద్రతా ప్రమాణాల పర్యవేక్షణకు ఐదు శాఖల సంయుక్త కమిటీ

కరీంనగర్, మే 15: కరీంనగర్‌లోని వన్ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటుచేసుకున్న లిఫ్ట్ ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించారు. ఘటన అనంతరం వైద్యశాఖ అధికారులు ఆస్పత్రిని సందర్శించి ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులను పరిశీలించారు. లిఫ్ట్ నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, అత్యవసర సదుపాయాలు, నిర్వహణ రికార్డులపై ఆరా తీశారు. ది క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్--2010లోని సెక్షన్--12 ప్రకారం గురువారం జిల్లా వైద్యాధికారి వన్ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యానికి షోకాస్ నోటీసు జారీ చేశారు. పోలీస్, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు కూడా ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల పర్యవేక్షణ కోసం పోలీస్, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్, వైద్యశాఖ అధికారులతో సంయుక్త కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కమిటీ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించనుంది. ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటించాలని, లిఫ్ట్‌లు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర మార్గాలు, సాంకేతిక పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యం అస్సలు ఉండకూడదని కలెక్టర్ హెచ్చరించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని, రోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కరీంనగర్లో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని రకాల అనుమతులు ఇస్తామని, నిరంతర పర్యవేక్షణ ద్వారా భద్రతా ప్రమాణాలు మెరుగుపడి రోగులకు నాణ్యమైన సేవలు అందుతాయని కలెక్టర్ తెలిపారు.

### భద్రతా ప్రమాణాలపై కీలక సూచనలు

- ఆస్పత్రి ప్రాంగణంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- రోగులు, సిబ్బంది, సందర్శకుల భద్రత కోసం తగిన సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.
- అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్ సేఫ్టీ పరికరాలు సిద్ధంగా ఉంచాలి.
- ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలను స్పష్టంగా సూచించాలి.
- బయోమెడికల్ వ్యర్థాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలి.
- ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ వంటి కీలక విభాగాల్లో ప్రత్యేక భద్రతా ప్రమాణాలు పాటించాలి.
- విద్యుత్, ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించాలి.
- సంక్రమణ వ్యాధుల నివారణకు శుభ్రత, శానిటైజేషన్ చర్యలు కచ్చితంగా చేపట్టాలి.
- ఆస్పత్రి సిబ్బందికి తరచూ భద్రతా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.
- లిఫ్ట్‌లు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర మార్గాలు, సాంకేతిక పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదు.
- అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలి.

రోగుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై వచ్చే మంగళవారం ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం విజయవంతం

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలకు గ్రామస్థుల సంకల్పం



గంగాధర, మే 15: గంగాధర మండలంలోని ఒద్యారం గ్రామంలో ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో రాము ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ మాధవి, సర్పంచ్ ఉమ, ఉప సర్పంచ్ గగన్, జీపీ సెక్రటరీ శ్యామల, పాలకవర్గ సభ్యులు, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, అనంతరం ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. తరువాత గ్రామ సభ నిర్వహించి "మన ఊరి పిల్లలు మన ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలి" అనే సంకల్పంతో చర్చలు జరిపారు. గ్రామంలోని వార్డు సభ్యులు బాధ్యత తీసుకుని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాపట్ల కొత్త చైతన్యాన్ని తీసుకువచ్చింది. ఈ సందర్భంగా సాధించిన అడ్మిషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

6వ తరగతిలో ఇద్దరు, 5వ తరగతిలో ఒకరు, 4వ తరగతిలో ఒకరు, 1వ తరగతిలో ఒకరు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలు, విద్యార్థుల భవిష్యత్తు అవకాశాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. "ప్రభుత్వ పాఠశాల ప్రతి పిల్లవాడి హక్కు, ప్రతి గ్రామం గర్వం" అని పేర్కొన్నారు.

# పదవులకు రాజీనామా చేసిన ఎస్ఎల్ గౌడ్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్ తన పదవులకు వ్యక్తిగత కారణాలతో గురువారం రాజీనామా చేశాడు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని తనకు ఇస్తూ జీవో జారీ చేయగా ఆ పదవికి తాను వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు కరీంనగర్ మార్కెట్ కార్యదర్శికి పత్రాన్ని గురువారం అందించారు. అలాగే గత కొంత కాలంగా మానకొండూర్ నియోజకవర్గంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కొనసాగిన తను తన పదవికి రాజీనామా చేసినట్లు పత్రాన్ని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేరున రాసి జిల్లా కాంగ్రెస్ ఆఫీసులో అందించారు. తన రాజీనామాలను ఆమోదించాలని ఆయన అందించిన పత్రాలలో పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతొక్కరికి 'ఇందిరమ్మ ఇండ్లు'

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ చీఫ్ బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట : ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతొక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ చీఫ్ బీర్ల అయిలయ్య తెలిపారు. గురువారం యాదగిరిగుట్టలోని గుండ్లపల్లికి చెందిన లబ్ధిదారుడు గుండ్లపల్లి సత్యం గౌడ్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పట్టుబట్టలు పెట్టి యాటపోతు కోసం నగదును కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేళ్లు ఊరించిన మాజీ సీఎం కేసీఆర్.. ఒక్కరికైనా పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున పేదలకు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్ల చొప్పున మంజూరు చేసి ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. మొదటి విడతలో ఆలేరు నియోజకవర్గంలో 3700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేపించామన్న ఆయన.. జూన్ 2 నుండి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉంటుందని తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనమని, రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా ఇదే విధమైన ఫలితాలు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, పేరబోయిన సత్యనారాయణ, బూడిద మధు, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు బందారపు బిక్షపతి తదితరులు ఉన్నారు.

# 23న యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

**వేద పాఠశాల సహా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం**



యాదగిరిగుట్ట : ఈ నెల 23న యాదగిరిగుట్టకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా టెంపుల్ సిటీలో నిర్మించనున్న వేద పాఠశాలకు శంకుస్థాపన చేసి పనులను అంకురార్పణ చేయనున్నారు. వేద పాఠశాలతో పాటు కొండపైన ఏర్పాటు చేసే పలు అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ చేయనున్నారు. ఇక వేద విద్యను అభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం టెంపుల్ సిటీలో ప్రభుత్వం 15 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించగా.. చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి అయింది. ఈ నెల 23న యాదగిరిగుట్టకు రానున్న సీఎం రేవంత్.. మొదట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం టెంపుల్ సిటీకి వెళ్లి వేద పాఠశాల పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కొండపైన వసతి గదులు, డార్మెటరీ హాల్, కల్యాణ మండపంతో పాటు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే పలు మౌలిక సదుపాయాల పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించనున్నారు. కాగా ఈ నెల 23న యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారు కాగా అధికారిక స్కెడ్యూల్ రావాల్సి ఉంది.

# జనగామలో నిరుద్యోగ యువతకు ఉచిత సైనిక, పోలీస్ కోచింగ్

జనగామ : సావిత్రి భాయి పూలే ఫౌండేషన్, అర్జున్ డిఫెన్స్ అకాడమీ మరియు ప్రెస్టన్ యాజమాన్యం సంయుక్తంగా జనగామలో నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణ క్యాంప్ నిర్వహిస్తున్నాయి మే 15, 2026 శుక్రవారం నుండి ప్రెస్టన్ ప్రాంగణంలో ఈ శిక్షణ ప్రారంభం కానుంది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, అగ్నిపథ్, కానిస్టేబుల్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ వంటి రక్షణ మరియు పోలీస్ శాఖల ప్రవేశ పరీక్షలకు నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తారు. మాజీ ఆర్మీ అధికారులు, అనుభవజ్ఞులైన కోచ్‌లు, ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 6:30 నుండి 8:30 వరకు, సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు తరగతులు జరుగుతాయి. గత 4 సంవత్సరాలుగా జనగామలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా బాలికల విద్యాలయాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్స్, ఆల్-ఇన్-వన్ పుస్తకాలు అందిస్తున్న సావిత్రి భాయి పూలే ఫౌండేషన్ ఈసారి ఉచిత కోచింగ్ కూడా అందిస్తోంది. జనగామ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ యాసారపు కరుణాకర్ కోరారు. మరిన్ని వివరాలకు 7981481234, 9599851605,
నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు

# పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసులో అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్ట్




## 'ది గోల్డెన్ థీఫ్' సుభోద్ సింగ్ మాస్టర్‌మైండ్‌గా గుర్తింపు

## రూ.82 లక్షల విలువైన బంగారం, వజ్రాభరణాల దోపిడీ కేసులో కీలక మలుపు

కరీంనగర్, మే 14: కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాప్‌లో జరిగిన సంచలన దోపిడీ కేసులో కరుడుగట్టిన అంతర్‌రాష్ట్ర దోపిడీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్‌ను మే 13న వెలిచాల ఎక్స్‌రోడ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వెల్లడించింది. ఈ కేసు కరీంనగర్-2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైమ్ నెంబర్ 245/2026 కింద నమోదు అయింది. మే 3న జరిగిన ఈ దోపిడీలో 161.4 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాభరణాలు కలిపి సుమారు రూ.82.02 లక్షల విలువైన ఆభరణాలు దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో నలుగురు షాప్ సిబ్బంది గాయపడ్డారు. పోలీసుల దర్యాప్తులో ఈ ఆపరేషన్‌ను ప్రస్తుతం బీహార్ జైలులో ఉన్న అంతర్‌రాష్ట్ర గ్యాంగ్ లీడర్ సుభోద్ సింగ్ అలియాస్ "ది గోల్డెన్ థీఫ్" పక్కా ప్రణాళికతో నిర్వహించినట్లు తేలింది. మరో ఇద్దరు నిందితులు రవీష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చారు. విచారణలో బీహార్, పశ్చిమ బెంగాల్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ ముఠా తెలంగాణ, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో జ్యువెలరీ షాపులు, బ్యాంకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నంబర్ ప్లేట్లు, తప్పుడు పేర్లతో లాడ్జిలలో బస చేయడం, ఆధునిక సాంకేతికత వినియోగించడం ఈ ముఠా ప్రత్యేకతగా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం నిందితులు ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో రేకీ నిర్వహించి చివరకు పీఎంజే జ్యువెలరీ షాప్‌ను లక్ష్యంగా ఎంచుకున్నారు. దోపిడీకి ముందు ధర్మపురిలోని గెస్ట్ హౌస్‌లో బస చేసి ప్రణాళిక సిద్ధం చేశారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి ఆరు పిస్టల్స్, మ్యాగజైన్లు తెచ్చుకున్నట్లు విచారణలో తేలింది. మే 3న ఉదయం రెండు బైక్‌లపై కరీంనగర్‌కు చేరుకున్న నిందితులు ముందుగా షాప్‌లోకి కస్టమర్‌లా ప్రవేశించి పరిస్థితిని గమనించారు. అనంతరం మిగతా సభ్యులు లోపలికి వెళ్లి సిబ్బందిని తుపాకులతో బెదిరించి ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేశారు. సిబ్బంది ప్రతిఘటించడంతో కాల్పులు జరిపి పరారయ్యారు. తొందరలో ఒక ఆభరణాల బ్యాగ్‌ను అక్కడే వదిలి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

సాంకేతిక నిఘా, సీసీటీవీ ఫుటేజ్, అంతర్‌రాష్ట్ర సమాచారంతో ఇప్పటివరకు 13 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితుల వద్ద నుంచి రూ.51 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నారు.

మిగిలిన నిందితులు, దోచుకెళ్లిన ఆభరణాల కోసం ఐదు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసుల సూచనలు:**

- బ్యాంకులు, జ్యువెలరీ షాపుల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలి.
- అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- లాడ్జిలు, గెస్ట్ హౌస్‌లలో సరైన ఐడీ ధృవీకరణ తర్వాతే గదులు ఇవ్వాలి.
- నగదు, బంగారం రవాణాలో భద్రతా నిబంధనలు పాటించాలి.
- అత్యవసర అలారం వ్యవస్థలు, పానిక్ బటన్లు ఏర్పాటు చేయాలి.
- సిబ్బందికి అత్యవసర పరిస్థితులపై శిక్షణ ఇవ్వాలి.
- శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక విశ్లేషణ ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని, మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

# ఢిల్లీ మద్యం కేసు

**సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం.. తీవ్రంగా పరిగణించిన ఢిల్లీ హైకోర్టు**




**హైదరాబాద్,మే14:** ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి న్యాయవ్యవస్థపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. న్యాయమూర్తులను, కోర్టు విచారణలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారంటూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు ఆప్ నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు జస్టిస్ స్వర్ణకాంత శర్మ గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయపరమైన అంశాలను కోర్టులో ఎదుర్కోవాల్సింది పోయి, వాటిని సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి.. న్యాయవ్యవస్థపై వ్యతిరేకతను పెంచేలా ప్రచారం చేస్తున్నారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తనపై, న్యాయస్థానంపై అత్యంత హేయమైన, కోర్టు ధిక్కారపూరితమైన అంశాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ఈ న్యాయ వివాదాన్ని ఓ బహిరంగ ప్రచారంగా మార్చేశారన్న ఆమె.. ఇది న్యాయ ప్రక్రియను అగౌరవపరచడమేనని అభిప్రాయపడ్డారు. గతంలో తాను ఒక కళాశాల కార్యక్రమంలో ప్రసంగించిన ఓ వీడియోను ప్రస్తుత కేసుకు ముడిపెడుతూ, అసందర్భంగా సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల తప్పుడు అభిప్రాయాన్ని కలిగిస్తాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా సాగుతున్న ఈ దుష్ప్రచారాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, పార్టీ నేతలు వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లకు కూడా కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. న్యాయవ్యవస్థపై బురదజల్లేలా వ్యవహరించినందుకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది న్యాయస్థానం. రాజకీయ పోరాటాలు ప్రజాక్షేత్రంలో జరగాలని, కానీ న్యాయస్థానాల తీర్పులను, న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సామాజిక మాధ్యమాలను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని ఈ సందర్భంగా కోర్టు హెచ్చరించింది. కాగా.. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే రాజకీయ ప్రకంపనలు కొనసాగుతుండగా, తాజాగా హైకోర్టు తీసుకున్న ఈ ధిక్కార చర్యల నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# భార్యతో గొడవ..

**నాటు తుపాకీతో కాల్చుకుని భర్త ఆత్మహత్య**



**కామారెడ్డి,మే14 :** లింగంపేట మండలం మోతె గ్రామంలో దారుణ ఘటన వెలుగు చూసింది. నాటు తుపాకీతో కాల్చుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మోతె గ్రామానికి చెందిన ఇంద్రజిత్ సింగ్‌కి ఓ మహిళతో కొన్నేళ్ల కిందట వివాహం అయ్యింది. కొన్నాళ్లపాటు బాగానే సాగిన వారి కాపురంలో వివాదాలు మొదలయ్యాయి. దీంతో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. గురువారం కూడా వారి మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. అయితే, ఈసారి వివాదం మాటలతో ముగిసిపోలేదు. తరచూ గొడవలతో విసిగిపోయిన ఇంద్రజిత్ సింగ్ కఠిన నిర్ణయం తీసుకున్నాడు. తన వద్ద ఉన్న నాటు తుపాకీ తీసుకుని భార్య ముందే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com